బీఆర్‌ఎస్‌లో నయా జోష్

బైక్ ర్యాలీతో హోరెత్తించిన గులాబీ దండు, ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్



నగరంలో జీకే యూత్ బైక్ ర్యాలీ

కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అయింది. కరీంనగర్ నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనసందోహంతో నగరం గులాబీమయమైంది. ఉదయం నుంచే బీఆర్‌ఎస్ శ్రేణులు, జీకే యూత్ సభ్యులు వందలాది బైక్‌లతో ర్యాలీ చేపట్టారు. ఉజ్వల పార్క్ వద్ద ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌కు హెలీకాప్టర్‌లో చేరుకున్న కేటీఆర్‌కు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ వై.సునీల్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర శాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఘన స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో బైపాస్ రోడ్డు గుండా సభా ప్రాంగణమైన పద్మనగర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు బైక్ ర్యాలీగా వెళ్లారు. సభ ఎలాంటి ఇక్కట్లు లేకుండా సజావుగా జరగడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నయా జోష్ నెలకొంది.

కేటీఆర్‌కు చేపలు అందజేత

ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన మంత్రి కేటీఆర్‌కు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డివేణి మధు బొమ్మె చేపలు, వల బహూకరించారు.

పూలమొక్క అందజేసి స్వాగతం

మంత్రికి డిప్యూటీ మేయర్ స్వరూపరాణి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ జ్ఞాపిక..

మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మార్షల్, సతీమణి కార్పొరేటర్ మెండి శ్రీలత జయహో రామన్న ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ జ్ఞాపిక అందజేశారు.

సైడ్‌లైట్స్.. ఛలోక్తులు

- మంత్రి కేటీఆర్ మధ్యాహ్నం 12 గంటలకు సభా వేదిక పైకి రాగానే స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది.
- మంత్రి కేటీఆర్ బీజేపీ, కాంగ్రెస్‌లను విమర్శించినప్పుడల్లా జనం నుంచి స్పందన వచ్చింది.
- సభలో యువత, విద్యార్థులు పాల్గొన్నారు.
- మంత్రి గంగుల కమలాకర్ పేరు ఎత్తినప్పుడల్లా జై గంగుల.. జైజై గంగుల అంటూ కేరింతలతో సభాప్రాంగణం దద్దరిల్లింది.
- ఎమ్మెల్యేగా మంత్రి గంగులను, ఎంపీగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. గతంలోనే మోసపోయాం.. జాగ్రత్త అనడంతో సభలో నవ్వులు విరిశాయి.
- ఒక్క గంగులనే కాదు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్‌లనూ గెలిపించేలా మిత్రులకు, బంధుగణానికి సూచించాలని కోరారు.
- వేదికపై మధుప్రియ, సందీప్‌ల కళాబృందాలు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.
- మంత్రి కేటీఆర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ తిలకం దిద్దారు.
- కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్ అభ్యర్థులతోపాటు ఎంపీ అభ్యర్థిగా వినోద్‌కుమార్‌లను పరిచయం చేసినప్పుడు ప్రజలు చప్పట్లు కొట్టారు.
- మంత్రి కేటీఆర్ ప్రసంగం 20 నిమిషాలపాటు సాగింది.



ప్రజా ఆశీర్వాద సభకు తరలివస్తున్న మహిళలు



కేటీఆర్‌కు చేపలు, వల బహూకరిస్తున్న మధు



మొక్క అందిస్తున్న డిప్యూటీ మేయర్



జ్ఞాపిక అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీలత

క్లుప్తంగా

'బీజేపీని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదు'

కరీంనగర్‌టౌన్: ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై కరీంనగర్ బీఆర్‌ఎస్ ప్రజాఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను పార్టీ రాష్ట్ర నాయకుడు కొట్టె మురళీకృష్ణ ఒక ప్రకటనలో ఖండించారు. దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధానిని ప్రపంచ దేశాలు మెచ్చుకుంటూ కితాబిస్తుంటే కేటీఆర్ అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారని ప్రజలంతా విషయాన్ని గ్రహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం కల్పించాలని కోరారు.

ఎన్నికల నిబంధలు ఉల్లంఘిస్తే కేసులు

కరీంనగర్‌రూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని కరీంనగర్ రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు. బుధవారం నగునూరులో కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళిపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...గ్రామంలో ఎలాంటి గొడవలు, కొట్లాట జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఏఎస్సై అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ సొసైటీ ఎన్నికలు



మీస రాజయ్య, మంద నాగరాజు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ సొసైటీ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మీస రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా మంద నాగరాజు ఎన్నికయ్యారు. అలాగే సొసైటీ గౌరవ అధ్యక్షులుగా గుండ రవి,చల్లవేని రాజు, ఉపాధ్యక్షుడిగా జనగామ రాజు, జనరల్ సెక్రెటరీగా కుంభం మల్లేశం, ఎండీ వలీయొద్దీన్,ఎండీ రియాజ్‌అలీ, పైడిపాల సురేందర్, లక్ష్మణాచారి, ఉప్పుల లక్ష్మణ్, గంగాదేవ్ నియామకమయ్యారు.

ఎన్నికల కో ఆర్డినేటర్‌గా 'ఇనుగాల'



కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఎన్నికల కో ఆర్డినేటర్‌గా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ప్రకటనలో తెలిపారు.

నియామకం



నియామకపత్రం అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా ఎండీ అష్రఫ్‌అలీని నియమిస్తూ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన నేతలకు అష్రఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

కోరం లేక జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా



సమావేశాన్ని వాయిదా వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

కరీంనగర్: కోరం లేక బుధవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎప్పటిలాగే వాయిదా పడింది. రెండేళ్లుగా సమావేశాలు ఏర్పాటు చేయగా సకాలంలో ప్రజాప్రతినిధులు రాకపోవడం పరిపాటిగా మారింది. దీంతో మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడం, సభ్యుల గైర్హాజరుతో నిమిషాల్లోనే వాయిదా వేయడం రివాజుగా మారింది. జిల్లాలో నెలకొన్న సమస్యలతో పాటు ఇతర ముఖ్య విషయాలను చర్చించి ఎప్పటికప్పుడు సంస్థలకు పెద్దన్న పాత్ర వహించాల్సిన జిల్లా పరిషత్ నిధుల లేమితో నిర్వీర్యమవుతోంది. సభ్యులు సైతం సమావేశాలంటే పట్టనట్లుగా వ్యవహరించడంతో అభివృద్ధికి కీలకమైన సమావేశాలు రెండేళ్లుగా పేలవంగా కొనసాగుతున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సీఈవో పవన్‌కుమార్, కొంత మంది అధికారులు హాజరై ఇతరుల కోసం వేచి చూసి అరగంటలోనే సమావేశం వాయిదా వేశారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ జిల్లా కేంద్రంలో జరిగిన మంత్రి కేటీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు.



సమావేశ మందిరంలో ఖాళీ కుర్చీలు

దుర్గాదేవీ నమోస్తుతే!



హౌజింగ్ బోర్డ్ కాలనీలో అమ్మవారికి కరెన్సీతో అలంకరణ

కరీంనగర్‌కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతకు బుధవారం భక్తులు పూజలు నిర్వహించారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో మహాలక్ష్మీ రూపంలో దర్శనమివ్వగా కూష్మాండా చీరలతో అలంకరించారు. సాయంత్రం సౌందర్యలహరి, కనకధారాస్తోత్ర పారాయణం చేశారు. ఆలయ నిర్వాహకుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులు పూజల్లో పాల్గొన్నారు. హౌజింగ్‌బోర్డ్ కాలనీలో డెకరేషన్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి కరెన్సీతో అలంకరణ చేశారు. అంతకుముందు పోచమ్మ బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో దాత కొండూరు అనిల్‌కుమార్, కౌశిక్, సాయిరాం, సందీప్, క్రాంతి, రాజేశ్, సంజీవ్, కార్తిక్, మమత, పద్మ, రజని పాల్గొన్నారు.

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు వైష్ణవీ అలంకరణలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పవనకృష్ణశర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ఆలయ ఫౌండర్, చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వైష్ణవీ అలంకరణలో గరుడ వాహనంపై అమ్మవారు



మహాశక్తి ఆలయంలో చీరలతో అలంకరణ

ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన

కొత్తపల్లి: విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించడంతో పాటు వ్యక్తిగత సమయం కాపాడుకోవచ్చని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. సీఎండీ ఆదేశాల మేరకు బుధవారం కరీంనగర్ విద్యుత్ భవన్ ఆవరణలోని రూరల్ ఈఆర్‌వో కార్యాలయం సందర్శించారు. ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. వినియోగదారులు డిజిటల్ చెల్లింపులపై దృష్టి సారించాలని కోరారు.

రెండో రోజూ ఆపరేటర్లకు శిక్షణ

కరీంనగర్‌లోని సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని 182 విద్యుత్ సబ్‌స్టేషన్ల ఆపరేటర్లకు రెండోరోజూ బుధవారం సాంకేతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వి.గంగాధర్, డీఈలు విజయేందర్‌రెడ్డి, కాళిదాసు, పీవో చంద్రయ్య, ఏడీఈలు జి.శ్రీనివాస్, కిరణ్‌కుమార్, పంజాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ గంగాధర్

విరగబూసిన తంగేడు పూలు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో తంగేడు పువ్వుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. తంగేడు పూలతో పేర్చిన బతుకమ్మ శోభాయమానంగా ప్రకాశిస్తోంది. దశాబ్దం క్రితం గుట్టలు, అటవీప్రాంతాల్లో విరివిగా కనిపించే తంగేడుచెట్లు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తంగేడు పువ్వును రాష్ట్ర పుష్పంగా ప్రకటించారు. కనుమరుగవుతున్న తంగేడు చెట్లను కాపాడాలనే ఉద్దేశంతో హరితహారంలో తంగేడు మొక్కలు నాటాలని నిర్ణయించారు. మూడేళ్లక్రితం కరీంనగర్ మండలంలోని గ్రామాల్లోని రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటగా. ప్రస్తుతం చెట్లుగా ఎదిగి పూలతో కళకళలాడుతున్నాయి. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పువ్వు కోసం బయటకు వెళ్లాల్సిన బాధ తప్పిందని అంటున్నారు.



ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



విద్యార్థులకు మంటలార్పే విధానం వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హై స్కూల్‌లో ఎన్‌సీసీ శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం అగ్నిమాపక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అగ్నిప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలో అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శనలతో వివరించారు. అదే విధంగా హరితహారంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో కేడెట్లు మొక్కలు నాటారు. ఎన్‌సీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



భాస్కర్

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు కె. భాస్కర్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఐఐసీటీ సైంటిస్ట్ డా.జె.ఎస్. యాదవ్ పర్యవేక్షణలో 'టువర్డ్స్ సింథసిస్ ఆఫ్ టెట్రాహైడ్రోపైరాన్ యూనిట్ ఆఫ్ ఆమ్ఫిడినోల్-3 అండ్ నావెల్ హైబ్రిడ్ బెంజోఫ్యూరాన్- ట్రైజోల్స్, దేర్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈసందర్భంగా బుధవారం భాస్కర్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కల్వకుంట్ల రామకృష్ణ, అధ్యాపకులు ఎం.శ్రీధర్, జి.శ్రీనివాస్, డా.బి.మహిపాల్‌రెడ్డి, సాయిమధుకర్, స్టాఫ్‌క్లబ్ సెక్రెటరీ ఎ.శ్రీనివాస్, ఓదెల్ కుమార్, మల్లారెడ్డి, ప్రమోద్, టీజీసీజీటీఏ రాష్ట్ర కార్యదర్శి కె. సురేందర్‌రెడ్డి, రాజు, అర్చన, సతీష్, సత్యనారాయణ, శంకర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే బోర్‌వెల్ మాయం

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు

కరీంనగర్ కార్పొరేషన్: పేద ప్రజలకు నీరందించే పబ్లిక్ బోర్‌వెల్ రాత్రికి రాత్రే మాయమైన ఘటన నగరంలో చోటుచేసుకుంది. 47వ డివిజన్ పరిధి షాషామహల్‌లో తన ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉందన్న కారణంతో ఓ వ్యక్తి బోర్‌వెల్ తొలగించడం వివాదానికి దారితీసింది. నగరపాలక సంస్థ అధికారులు సైతం ఇంటి యజమానికే వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తిరిగి ఏర్పాటు చేయాలి

తొలగించిన పబ్లిక్ బోర్‌వెల్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ కలెక్టర్ గోపికి ఫిర్యాదు చేశారు. 47వ డివిజన్‌లోని ఇంటి నంబర్ 1-2-100, 1-2-100/ఏ ఇళ్ల ముందు ఏళ్ల క్రితం నగరపాలక సంస్థ బోర్‌వెల్ ఏర్పాటు చేసిందన్నారు. ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి ఇబ్బందిగా ఉందన్న కారణంతో దాన్ని తొలగించాడని పేర్కొన్నారు. నగరపాలిక డీఈ, ఏఈలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

మానకొండూర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని పార్టీ మానకొండూర్ నియోజవర్గ అభ్యర్థి, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులకు కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మండలంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించలేదన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీంద్రచారి, సంపత్‌గౌడ్, రాజయ్య, సమ్మయ్య, కుమార్, దేవయ్య పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని సరస్వతినగర్‌లో బుధవారం తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చిన మహిళలు ప్రధాన చౌరస్తాలో ఆడిపాడారు. ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు హక్కులు సాధించుకోవాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండేటి మల్లీశ్వరి, అర్చన, లక్ష్మి, కవిత, జమున, లత, సుమలత, పద్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

విట్స్ కళాశాలలో...

బొమ్మకల్ బైపాస్‌లోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు రంగురంగుల పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ బి.గోవిందరావు, ప్రిన్స్‌పాల్ మురళి, ఏవో సుధాకర్‌రావు, హెచ్‌వోడీ మాధవి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మతో విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు



తీగలగుట్టపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు